క్లుప్తంగా

వేణుగోపాలస్వామికి నీలం మధు పూజలు


నీలం మధును సన్మానించిన నిర్వాహకులు

పటాన్‌చెరు: మండలంలోని చిట్కుల్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో మెదక్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మధును ఆలయ కమిటీ సభ్యులు సాధరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, నారాయణరెడ్డి, నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వీరాస్వామి, అంజిరెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

సురేశ్ కుమార్ షెట్కార్ గెలుపు ఖాయం


కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేశ్ కుమార్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంతరావు పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ఝరాసంగం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు జైపాల్, సామెల్, ఏసప్ప, రాజు, యాదులు, నర్సింహులు, చింటూ గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలువేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ ఎన్నికల్లో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు పోటీలు


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పలు సబ్జెక్టులపై గురువారం పోటీలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితం, సామాన్యశాస్త్రంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు. విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళారులను నమ్మొద్దు


ప్రారంభిస్తున్న ఏఈఓ శ్రీకర్ తదితరులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఈఓ శ్రీకర్, మహిళ సమాఖ్య గ్రామ అధ్యక్షురాలు ఎం.నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2203, సాధారణ రకానికి రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఓఏ ఆర్.ఆంజనేయులు, రైతులు బి.సంగమేశ్వర్, హెచ్.వెంకట్‌రెడ్డి, జె.అందజయ్య, మల్లయ్య, రాములు, గంగారం, బషీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు వన్‌టైం అవకాశం

జహీరాబాద్ టౌన్: ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని కళాశాల్లో డిగ్రీ చదివి ఫెయిల్ అయిన పూర్వ విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు అధికారులు వన్‌టైం అవకాశం కల్పించారని ఆచార్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ ప్రకటనలో తెలిపారు. 2000–2021 నుంచి 2018–2019 విద్యా సంవత్సరం వరకు డిగ్రీ చదివి ఫెయిల్ అయిన విద్యార్థులంతా పరీక్షలు రాసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మే, జూన్ నెలల్లో పరీక్షలు నిర్వహించనున్నారని, 15వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కోడ్' కష్టాలు


వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి, పోలీసులు

- నగదు తరలించాలంటే ఇబ్బందులు
- శుభకార్యాల సామగ్రి కొనుగోళ్లకు ఇక్కట్లు
- రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే స్వాధీనమే

నారాయణఖేడ్: లోక్‌సభ ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో జిల్లాలో కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో పోలీసులు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అన్ని చోట్లా తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లడానికి వీల్లేదు. ఒకవేళ అంతకు మించి నగదు ఉంటే దానికి సంబంధించిన ఆధారాలు వెంట తీసుకెళ్లాలి. ప్రస్తుతం రైతులు తాము పండించి పంటను మార్కెట్‌కు తరలించి విక్రయించగా వచ్చిన డబ్బును తీసుకెళుతుంటారు. అలాగే వ్యాపారస్తులు సరుకుల కొనుగోలు, బకాయిల వసూలు చేసిన డబ్బు, ఇతర అవసరాల కోసం అధిక మొత్తంలో డబ్బులు తీసుకెళ్తుంటారు. అదే విధంగా ప్రస్తుతం పెళ్లిళ్లు కూడా ఎక్కువగా జరుగుతున్న సమయం. నగలు, దుస్తులు, ఇతర సరుకుల కొనుగోలు కోసం ఎక్కువ డబ్బుతో ప్రజలు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. పోలీసుల తనిఖీ సందర్భంగా ఆయా వాటికి సంబంధించిన పత్రాలను చూపించాల్సి ఉంటుంది. పోలీసులు ఆ ఆధారాలతో సంతృప్తి చెందకుంటే వాటిని స్వాధీనం చేసుకొని ఆదాయపన్ను శాఖకు అప్పగిస్తారు. అక్కడ ఆధారాలు చూపించి వాటిని తీసుకోవాల్సి ఉంటుంది.

శుభకార్యాలకు ఇబ్బందులు

ప్రవర్తనా నియమావళితో శుభకార్యాల నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కోట్లలో వ్యాపారం జరుగుతుంటుంది. కోడ్ అమల్లోకి రావడంతో నగదు లావాదేవీలకు కష్టకాలం వచ్చింది. వస్తువుల కొనుగోలుతోపాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్, బంగారం, వస్త్రాల కొనుగోలుకు తిప్పలు తప్పడం లేదు. సారె వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలుకు నగదు తీసుకురావడానికి భయపడుతున్నారు. ఈ నెలలో ఎక్కువగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెళ్లి సామగ్రిని సమకూర్చుకోవడానికి నిర్వాహకులు అష్టకష్టాలు పడుతున్నారు.

నగదు స్వీకరణకే మొగ్గు..

బంగారం, ఇతర సామాగ్రి కొనాలంటే చేతిలో రూ.లక్షలు ఉండాల్సిందే. అప్పుడే షాపింగ్‌కు వీలవుతుంది. ఆన్‌లైన్ చెల్లింపులపై ఐటీ ఆంక్షలు కొనసాగుతుండడంతో ఎక్కువమంది వ్యాపారులు నేరుగా నగదు స్వీకరణకే మొగ్గు చూపుతున్నారు. ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు, కేటరింగ్ సంస్థలు, హోటళ్లు తదితర ఆన్‌లైన్ చెల్లింపులు స్వీకరించడానికి ఆసక్తి చూపడంలేదు. గతంలో కంటే ఎన్నికల కోడ్ వల్ల ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం కాస్త నెమ్మదించిందని వ్యాపారులు వాపోతున్నారు.


తుమ్మన్ పల్లి కప్పాడ్ వద్ద లీకవుతున్న నీరు


ఝరాసంగంలో వృథాగా..

'భగీరథ'నీరు వృథా

ఝరాసంగం(జహీరాబాద్): ఓవైపు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు గంటల పాటు వృథాగా పోతోంది. గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రవేశ పెట్టింది. పనులు సరైన విధంగా చేపట్టకపోవడంతో మండలంలోని చాలా గ్రామాల్లోకి తాగునీరు సరఫరా కావడం లేదు. నిత్యం ఏదో ఒకచోట లీకేజీలు ఏర్పడి నీరువృథాగా పోతోంది. బుధవారం అర్ధరాత్రి సమయంలో మండల కేంద్రమైన ఝరాసంగంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న వాల్వ్ నుంచి నీరు ఎగసిపడుతూ వృథాగా పోయింది. అదేవిధంగా గురువారం కప్పాడ్‌నుంచి తుమ్మన్ పల్లి గ్రామాల మధ్య ఉన్న వాల్వ్ నుంచి కొన్ని గంటల పాటు తాగునీరు వృథాగా పోయింది. అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని నీరు వృథాగా పోకుండా అరికట్టాలని కోరుతున్నారు.

కోత దశలో యాసంగి పంటలు


కోత దశలో ఉన్న జొన్న పంట

- కొనసాగుతున్న కోతలు
- బిజీబిజీగా రైతులు

రాయికోడ్(అందోల్): యాసంగి సీజన్‌లో భాగంగా రైతులు సాగు చేస్తున్న జొన్న, తెల్లకుసుమ పంటలు కోతదశలో ఉన్నాయి. ఎకరా జొన్నసాగు కోసం సుమారు రూ.15వేలు, తెల్లకుసుమ సాగుకు రూ.12వేల వరకు పెట్టుబడులు వెచ్చించినట్లు రైతులు తెలిపారు. జొన్న విత్తన రకాలను బట్టి ఎకరాకు 6నుంచి 10క్వింటాళ్ల దిగుబడి, తెల్ల కుసుమ ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయి. యాసంగిలో భాగంగా మండలంలో 2,225 ఎకరాల్లో జొన్న, 289ఎకరాల్లో తెల్ల కుసుమను సాగుచేశారు. జొన్నసాగుతో పంట దిగుబడితో పాటు పశుగ్రాసం ఉత్పత్తి కానుండడం జొన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో రైతులు పంటసాగుపై ప్రధానంగా దృష్టి సారించారు. అదే విధంగా యాసంగిలో భాగంగా మండలంలో 4,232 ఎకరాల్లో శనగసాగు చేయగా ఆ పంట కోతలు కూడా కొనసాగుతున్నాయి. ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మరో రెండు వారాల్లో ఆయా పంట రాసులు పూర్తవుతాయని రైతులు చెపుతున్నారు.

రెండు ఇళ్లలో చోరీ

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని దుండగులు రెండు ఇళ్లలో చోరీచేసి 17తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హెచ్ఎంటీ కాలనీకి చెందిన రమాదేవి ఒకటో తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం ఆ ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు రమాదేవికి సమాచారం అందించారు. దీంతో ఆమె వచ్చి చూడగా ఇంట్లో 4తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేవిధంగా ఆర్టీసీ కాలనీకి చెందిన వెంకటరమణ ఇంట్లోను 13తులాల బంగారం అపహరణకు గురవడంతో ఫిర్యాదు చేశారు. కేసులు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పాటపై తూటా' సదస్సు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో నిర్వహించనున్న 'పాటపై తూటా' సదస్సును విజయవంతం చేయాలని గద్దర్ కుమారుడు సూర్యం పిలుపునిచ్చారు. గురువారం తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహం వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1997 ఏప్రిల్ 6న తన తండ్రిపై కాల్పులు జరిగిన రోజన్నారు. దానిని పురస్కరించుకుని శనివారం సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్, మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడికి బెయిల్ మంజూరు


సంగారెడ్డి టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమ్ముడు మధుసూదన్ రెడ్డికి మంగళవారం బెయిల్ మంజూరైంది. 20రోజుల తర్వాత బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 20న అక్రమ మైనింగ్ కేసులో ఆయన అరెస్టయిన విషయం తెలిసిందే. ఆయనకు కోర్టు 14రోజులు రిమాండ్ విధించింది. మధుసూదన్ రెడ్డికి చెందిన సంతోష్ సాండ్ మైనింగ్ కంపెనీ అనుమతులకు మించి మైనింగ్ చేయడంతో పాటు లీజ్ అగ్రిమెంట్ ముగిసినా రెన్యువల్ చేయించలేదని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ తెలిపింది.

బైక్ చోరీ..

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని దత్తగిరి కాలనీలో బుధవారం రాత్రి బైక్ చోరీ జరిగింది. దత్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న జోసెఫ్ తన మోటారు బైక్‌ను ఇంటి ఎదుట పార్క్‌చేసి ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌ను చోరీ చేశాడు. సీసీ పుటేజీలో ఆ దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ మేరకు జోసెఫ్ గురువారం జహీరాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంక్‌పై నుంచి దూకి..

యువకుడు ఆత్మహత్య


ప్రభు(ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): మన స్తాపం చెందిన ఓ యువకుడు భగీరథ ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మండల పరిధిలోని సీతారాంకుంట తండాకు చెందిన ప్రభు(35) నాలుగు నెలల క్రితం ప్రమాదానికి గురయ్యాడు. ఇక అప్పటి నుంచి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి మూడు, నాలుగు సార్లు పారిపోతే కుటుంబ సభ్యులు వెతికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్‌పై నుంచి దూకాడని, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడని ఎస్ఐ హరిశంకర్ తెలిపారు. అతడి భార్య శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

సరిహద్దులు చెరిపివేయాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నీలిమ

ఎంఐటీ ప్రొఫెసర్ నీలిమ

పటాన్‌చెరు టౌన్: ఇంజనీరింగ్ విభాగాల మధ్య సరిహద్దులను చెరిపివేయాలని, సంక్లిష్ట వ్యవస్థల్లోని వివిధ కారకాలు, పరస్పర చర్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయాలని మణిపాల్, ఎంఐటీలోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'కృత్రిమ మేథ యుగంలో అంతర్ విభాగ పరిశోధన, హెచ్‌పీసీ' అనే అంశంపై గురువారం ఆమె మాట్లాడారు. కృత్రిమ మేథ యుగంలో సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కోవడంలో, ఆవిష్కరణలను నడపడంలో అంతర్ విభాగ సహకారం ప్రాముఖ్యత గురించి ఆమె వివరించారు. తమ భవిష్యత్తు కోసం ఈసీఈ విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీఆర్‌శాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి, ప్రొఫెసర్ త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

దా'రుణం'


శ్రీకాంత్(ఫైల్)

లోన్‌యాప్ వేధింపులకు యువకుడు బలి

వట్‌పల్లి (అందోల్): లోన్ యాప్ వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. జోగిపేట ఎస్ఐ అరుణ్‌కుమార్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాడెం శ్రీకాంత్ (21) సదాశివపేటలోని ఎంఆర్ఎఫ్ కంపెనీలో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల కిందట లోన్ యాప్ ద్వారా రూ.30 వేల రుణం తీసుకున్నాడు. తర్వాత రుణం చెల్లించాలని లోన్‌యాప్ సిబ్బంది వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో శ్రీకాంత్ 4 నెలల్లోనే సుమారుగా రూ.1.30 లక్షలు చెల్లించాడు. అయినా లోన్‌యాప్ దారుల వేధింపులు ఆగలేదు. మరో రూ.80 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు శ్రీకాంత్‌పై అశ్లీల, అసభ్యకర పోస్టులు పెడుతూ వేధిస్తుండటంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. అయినా కూడా లోన్ యాప్ సిబ్బంది అతడి సోదరుడికి, తండ్రికి ఫోన్‌లు చేసి లోన్ డబ్బులు కట్టాలని డిమాండ్ చేశారు. లోన్ విషయం కుటుంబ సభ్యులకు తెలిసిందని మనస్తాపానికి గురైన శ్రీకాంత్ మార్చి 30న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ఉపాధ్యాయుల సేవలు గుర్తుండిపోతాయి


శోభారాణి దంపతులను సన్మానిస్తున్న లక్ష్మణ్ తదితరులు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజం, వారు చేసిన సేవలు గుర్తుండిపోతాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. చిరాగ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన టీచర్ శోభారాణి పదవీ విరమణ చేయడంతో గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శోభారాణి 42సంవత్సరాల పాటు సేవలందించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్ఎం రేణుకాదేవి, ఎంఈఓ బస్వరాజ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు తులసీరాం రాథోడ్, కార్యదర్శి శ్రీశైలం, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రైతు సదస్సు


నాటిక ప్రదర్శనలో విద్యార్థులు

జహీరాబాద్ టౌన్: కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన కళాశాల విద్యార్థులు నిర్వహించిన రైతు సదస్సు ఆకట్టుకుంది. మండలంలోని రంజోల్ రైతు వేదికలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మూడు నెలల నుంచి పంటలపై వారు పరిశోధనలు చేశారు. సాగు పద్ధతులను నేర్చుకున్నారు. వర్మీకంపోస్టు తయారీ, ఫామ్‌పాండ్‌ల నిర్మాణం తదితర అంశాలపై శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా రైతు సదస్సు నిర్వహించి వారు నేర్చుకున్న విషయాల గురించి వివరించారు. నాటిక ప్రదర్శన, ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త నితీశ్, ఉద్యాన శాఖ అధికారి శైలజ, కేవీకే శాస్త్రవేత్త వరప్రసాద్, ఏఈఓ ప్రదీప్‌కుమార్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు.

రూ.72.90 లక్షలు మాయం

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరుటౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గతేడాది డిసెంబర్ 28వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి ఓ మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. అనంతరం నిర్వాహకులు బాధితుడికి ఆన్‌లైన్ శిక్షణ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21 తేదీన అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో సదరు ఉద్యోగి అప్పులు చేసి మరీ ఆన్‌లైన్‌లో 16 దఫాలుగా రూ.72.90 లక్షలు నగదు ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. కొద్ది రోజులకు తాను పెట్టిన నగదుతో పాటు వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కల్హేర్(నారాయణఖేడ్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో జరిగిందని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మొల్లకుంట తండాకు చెందిన రాథోడ్ సునీత(30)కు ఖాజాపూర్‌కు చెందిన రాథోడ్ రాములుతో 9ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి నలుగురు సంతానం. బుధవారం రాత్రి సునీత ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. భర్త రాథోడ్ రాములు కొట్టడం వల్లే సునీత మరణించిందని ఆమె తండ్రి అంగోత్ దశరథ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కార్మికులకు నేతల పరామర్శ


క్షతగాత్రులను పరామర్శిస్తున్న నాయకులు

సంగారెడ్డి: రియాక్టర్ పేలి గాయపడిన కార్మికులకు కార్పొరేట్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మెన్నార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వారు పరామర్శించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర రావు పరిశ్రమ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం


దానేశ్వరి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి తన భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రాకేష్ వర్మ, భార్య దానేశ్వరితో కలిసి రెండు నెలల క్రితం మండలంలోని రామేశ్వరం బండ గ్రామానికి వచ్చి కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2న దానేశ్వరి ఆరోగ్యం బాగాలేదని చెప్పి పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయింది. భర్త సాయంత్రం వచ్చి చూసేసరికి ఆమె కనిపించలేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి..


మౌనిక(ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): బాలిక అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొండాపూర్ ఎస్ఐ హరీశ్ శంకర్ కథనం ప్రకారం.. నాగలిగిద్ద మండలం మహిసెల్లితండాకు చెందిన చందర్ కుటుంబ సభ్యులు వలస వచ్చి మల్కాపూర్ గ్రామ పరిధిలోని తాహెర్ ఫంక్షన్ హాల్‌లో పనిచేసుకుంటూ అక్కడే నివాసముంటున్నారు. అయితే వారి కూతురు మౌనిక గతనెల 26న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం మౌనిక తల్లి శాంత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడు..


మహమ్మద్ సాహెబ్(ఫైల్)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓవృద్ధుడు అదృశ్యమైన ఘటన బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం..టౌన్‌షిప్‌లో నివాసం ఉండే ఎండీ మహమ్మద్ సాహెబ్ బుధవారం సాయంత్రం వాకింగుకని బయటకు వెళ్లాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని కుమారుడు గౌసుద్దీన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వృద్ధుడు తెలుపురంగు టీ షర్ట్, ఎరుపు రంగు లుంగీ, నీలిరంగు రుమాలు ధరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థిని..

పటాన్‌చెరు టౌన్: కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పీజేఆర్ కాలనీకి చెందిన నూకరాజు కూతురు ఝాన్సీ ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో గురువారం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.